సాయంత్రం నాలుగు గంటలైంది. చిటపట చినుకులు పడుతున్నాయి. మేఘాలు బాగా ఆకాశాన్ని ఆవరించినయి.

'హరేరాం హరేరాం' 'హరేరాం హరేరాం' లో స్వరంలో గొణుగుతూ నలుగురు ప్రేమ సమాజం సభ్యులు ఒక శవాన్ని మోసుకు పోతున్నారు. ఆ వీధుల్లో వాళ్ళంతా ఆశ్చర్యంగాను; అసహ్యంగాను, కోపంగాను చూస్తూ లోలోపున ఏమి టేమిటో అనుకుంటున్నారు.

నిన్న రాత్రి ఎనిమిది గంటలకు చచ్చిన మనిషిని ఇంతవరకు ఒక్కరూ కూడా సంస్కారం చేయటానికి పూనుకోలేదు. ఎంత గట్టి బద్మాష్ మనుష్యులు. సుమారు ముప్ఫయి ఏళ్ళనుంచీ ఆ వీధిలో ఉంటున్నా ఇరుగు పొరుగువారి కొక్కరికీ కూడా అతని పై అభిమానం కలగలేదు. చేసుకున్న పెళ్ళామూ కన్న కూతురూ కూడా దగ్గరకు రాలేదు. ఎంత ఘోరం! రామ! రామ! ఎంత హీన బ్రతుకు—

'ఇదేంటమ్మా! ప్రొద్దుటనుంచీ పిలిచినా ఒక్కరైనా జాతివారు రాలేదు' అందొక ముసలమ్మ మూతి విరుస్తూ.

'ఎందుకొచ్చిందా డబ్బు! బుర్రలు కొట్టి పోగుచేసేడు. ఏమన్నా మోసుకు పోగలిగాడా' అన్నాడొక సంఘ సంస్కర్త.


'మాయ! ఇదంతా మాయ!' అన్నాడొక వేదాంతి.

* * *

రఘునాథం జన్మస్థలం విజయనగరం తాలూకాలోని దేవుపల్లి అగ్రహారం. అక్కడ బ్రతకటానికేమీ దారి కనబడక కొండలెక్కి మా ఊరొచ్చేడు. ఆరోజుల్లో అన్నీ కారుచవుకగా ఉండేవి. అటువంటి రోజుల్లో జయపురం వచ్చాడు రఘునాథం. దివాను నాశ్రయించి ధాన్యం గాదుల దగ్గర పడుకొని ప్రాణం విసిగిన రఘునాథం ఒక నాడు నూతిలోకి దూకేసాడు. అందరూ చేరి రఘునాథాన్ని బయటకి తీసి రాజుగారి ముందు నిలబెట్టేరు.

'నూతిలోని కెందుకు దూకావు'— అడిగారు రాజాగారు.

'బ్రతకలేక...' అన్నాడు రఘునాథం.



'అరె! నీ తస్సదియ్య! మా సంస్థానంలో బ్రతకలేక మనుష్యులు ఛస్తున్నారా? వెంకన్నా! ఈ పంతులుకో పనిప్పించు' అన్నారు రాజాగారు.

వెంటనే రఘునాథాన్ని మల్కనగిరి తాణాలో రెవెన్యూ ఇన్స్పెక్టరుగా వేసారు. ఆర్డరు చేతికందిస్తూ వెంకన్న పంతులు రఘునాథంతో అన్నాడు — 'హోయ్! పంతులూ! నిన్నెందుకు మలకనగిరి పంపుతున్నానో తెలుసా. నువ్వు లేనివాడివి. నాలుగు డబ్బులు జాగ్రత్త చేసుకొని పెళ్ళాం పిల్లల్ని పోషించుకో. నలుగురిలో మంచిగా మెలుగు. రాజాగారి శిస్తు మాత్రం కరక్టుగా పంపుతుండు.'

ఆ రోజుల్లో మలకనగిరి రెవెన్యూ ఇనస్పెక్టరంటే ఒక చిన్న కలక్టరన్న మాటే. వారానికొక నేతి డబ్బా, రెండు పుట్ల బియ్యం, నాలుగు తేనె సీసాలు— ప్రతి ముఠాదారూ తప్పకుండా తెచ్చి యిచ్చేవాడు. వారం వారం సంతలో కూరలు ఊరికే దొరికేవి. ఇవన్నీ కాక ఆ బంజరు ఆక్రమించావని, ఈ చెట్టు కొట్టేవని, ఆ జాగా కలుపుకున్నావని బెదిరించి అయిదూ, పదీ పుచ్చుకుంటుండే వాడు రఘునాథం. కొత్తగా సాగుబడిలోకి వచ్చిన భూములకి పన్ను విధించి, కొండ

స్టైని పోడు వ్యవసాయాన్ని పట్టి, కేసులు పెట్టి రాజాగారికి రాబడి కూడా ఎక్కువ చేసేడు. అందుకు మెచ్చి దివాను అతనికి అమీను పదవికి ప్రమోషనిచ్చాడు. అమీను బాబు కేంపు వేస్తే పాలు, పెరుగు,బియ్యం, నెయ్యి సమస్తం రయితులే సప్లయి చెయ్యాలి. పెళ్లి పందిరిలాగ ఉండేదా కేంపు. క్రమంగా రఘునాథంబాబు పేరు ఆ తాలూకా అంతా ప్రాకింది. అతనంటే ఎంతటి వాళ్లైనా గడ గడ లాడేవారు. ఊఁ ఆఁ అనకుండానే కోరిందల్లా తెచ్చియిస్తుండేవారు. లేకపోతే ఏం చేస్తాడోనని భయం.

పెళ్లిలో పెళ్ళాం ముక్కుకు పుల్లయినా పెట్టలేని రఘునాథం ఇప్పుడు వలభై తులాల బంగారం ఆమెకు కానుకగా ఇవ్వగలిగాడు. టేకు బీరువాలు, మంచాలు, కుర్చీలు, సమకూర్చుకున్నాడు. ఒక ధనవంతుడనిపించుకున్నాడు. కానీ అతని హృదయం ఇంకా దారిద్ర్యంలోనే కొట్టాడుకుంది. సాధారణంగా ఆషాఢ శ్రావణ మాసాలు, రైతులు కటకట లాడేరోజులు. ఇంట్లో ఉండే ధాన్యాన్నంతా, విత్తనాల క్రింద, కూలీల క్రింద ఖర్చుచేసి, పంట పండుతుందనే ఆశతో పొలాలవైపు కళ్లు విప్పుకొని చూస్తుంటారు. కలుపు తీయటానికి కోతలు కోయటానికి కూడా వాళ్లదగ్గర డబ్బు ఉండదు. అందుకని వాళ్లు సాధారణంగా సాహుకార్ల వాశ్రయించి ఋణాలు పుచ్చుకుంటుంటారు. సాహుకార్లు వాళ్లని చాలా మురిపిస్తారు. ఒక్కరూపాయి ఆ సమయంలో రైతుకిస్తే పంట పండింతరువాత తీసుకున్న రూపాయేకాక దానికి వడ్డీగా మూడు కుంచాల ధాన్యం ఇచ్చేవారు రైతులు. సమయాన్నిబట్టి ఆ వడ్డీ అయిదు కుంచాలవరకు హెచ్చేది. ఆ రోజుల్లో ఆఫీసర్లందరూ ఈ వడ్డీ వ్యాపారం చేస్తుండేవారు. అమీను రఘునాథం కూడా ఈ వ్యాపారం తన భార్య పేరున ఆరంభించాడు. వెయ్యి రూపాయలు అప్పులిచ్చి పదిగరిశల ధాన్యం ఫాయిదా వసూలు చేసేవాడు ప్రతి సంవత్సరం. ఎవరిసొమ్మయినా పోయేదికాని అమీను బాబుగారి సొమ్ముమాత్రం దమ్మిడీలతో సహా వసూలయ్యేది. అన్నివిధాలా

అమీను ఆదాయం క్రమంగా పెరిగింది. సాధారణంగా ధనం కూడుతున్న కొద్దీ దానిమీద మమకారం ఎక్కువవుతుంది. కొంచెం చేరగానే ఇంకొంచెం చేరుద్దామనిపిస్తుంది. రైతులు గల్లాధాన్యం కొలుస్తుంటే కొలత పాత్రలను మార్పించాడు రఘునాథం. చిన్న కుంచాలకు బదులు పెద్ద కుంచాలు వచ్చాయి. పుచ్చుకున్న వాడిదగ్గరే మళ్లీ మళ్లీ వసూలు చేయటం, దొంగరసీదులిచ్చి సంస్థానం లెక్కలలో వ్రాయక పోవటం, ప్రారంభించాడు.

ఇలా కొంతకాలం జరిగింది. దేనికైనా ఒక హద్దుంటుంది, ప్రజలుమాత్రం ఇలాంటి అన్యాయాన్నెంతకాలం సహించగలరు. గుసగుసలు బయలుదేరాయి. ప్రభుత్వానికి మహజర్లు వెళ్లినాయి. ఈ సంగతి చూచాయగా రఘునాథం గ్రహించాడు. తెలివిగలవాడవటం చేత వెంటనే రాజీనామా ఇచ్చి ఉద్యోగం వదులుకున్నాడు. రాజా మంచివాడవటంచేత ప్రభుత్వాధికారుల కేదో సమాధానం చెప్పి ఆందోళనను చల్లబరిచేడు.

రఘునాథానికి పదేళ్లవాడొక కొడుకు ఎనిమిదేళ్ల వయసు దాక కూతురూ ఉన్నారు. వాళ్లిద్దరూ ఇంకా చదువు మొదలు పెట్టలేదు. తండ్రి ఉద్యోగ భాగ్యభోగాలలో వారికి చదువుకోటానికి తీరుబడి లేక పోయింది. ఆ తల్లిదండ్రులకి పిల్లలకు చదువు చెప్పించటం అవసరమని అనిపించలేదు. నౌకరీనుంచి విరమించుకొని రఘునాథం జయపురం వచ్చేశాడు. మొట్టమొదటనలు దేవులపల్లె వెళ్లి అక్కడ ఇళ్ళూ వాకిళ్లు ఏర్పరచుకుందా మనుకున్నాడు. కాని తను అనేకమందికి అప్పులిచ్చాడు. ఆ డబ్బింకా వసూలు కాలేదు. తానార్జించిన ఏభైవేల రూపాయలూ ఇళ్లు వాకిళ్లమీద పెట్టేస్తే మరి పెరిగేదేముంది. ఈ డబ్బే వడ్డీలకిస్తే మరి నాలుగింత లవుతుంది. వడ్డీ వ్యాపారం అన్నిటికన్నా సులభమైందీ! కడుపులో చల్ల కదల నవసరంలేదు. బంగారం పరీక్షచేసే రాయి, ఒక్క త్రాసు ముఖ్యంగా పాషాణ హృదయం — ఈ వ్యాపారానికి కావలసిన సామగ్రి, వడ్డీ కట్టగలిగినంత లెక్కల జ్ఞానం ఉంటే చాలు. ఎక్కువ పరీక్షలేమీ పాసవవసరంలేదు. ఈ వ్యాపార సామగ్రి, ఈపాటి పాండిత్యం సంస్థానంలో పనిచేస్తున్నప్పుడే సంపాదించాడు రఘునాథం. ఆ రోజులలో రైతులకు అప్పిచ్చే బ్యాంకులు లేవు. ప్రభుత్వం కూడా రైతులకేమీ సహాయం చేసేది కాదు. అథవా రైతుల కెక్కడేనా ఆఫీసులో అప్పు దొరికితే అప్పులో మూడు వంతులు గుమస్తాలే ఉంచుకొని పావలా వంతు మాత్రమే రైతుల కిస్తుండేవాళ్ళు. మార్వాడి వ్యాపారస్థులు చాలామంది మదుపులేని ఆటగాళ్లే, ఎప్పుడూ ఇతరుల డబ్బుతోనే బొమ్మలాట లాడించటం వాళ్ల అలవాటు.

వ్రేళ్లకు రాళ్ల ఉంగరాలు, ముంజేతికి వాచీగొలుసు, గ్లాస్కోపంచ, చూసి అమాయక ప్రజలు వీళ్లను పెద్ద షావుకార్లనుకుంటారు. కానీ వీళ్ళప్రాణాలన్నీ వీళ్లకు అప్పులిచ్చే అయ్యల చేతుల్లో ఉంటాయని వాళ్లకేం తెలుసు.

రఘునాథం వడ్డీ వ్యాపారం క్రమక్రమంగా పెరిగింది. సునాయాసంగా వారం వారం వడ్డీక్రింద వందలవందల ధనం వసూలవుతుండేది. రాని పద్దులను వకీళ్ల చేతుల్లో పెట్టి దావాలు దాఖలు చేయించి, డిక్రీలుపొంది దమ్మిడీలతో సహా వసూలు చేస్తుండేవాడు. ఇలా రోజురోజుకూ పెరిగిపోతున్న ధనాన్ని చూస్తున్న పిల్లలకు దానివిలువేం తెలుస్తుంది. తండ్రికి తెలిసో తెలియకో, చెప్పో చెప్పకో, రోజూ ఇంటినుంచి డబ్బు తీసికెళ్లి తోటి పిల్లలతో జల్సాగా తిరుగుతుండేవాడు కొడుకు. స్కూలుకి వెళ్లటం ఎప్పుడో మానేశాడు. తన డబ్బు తన వడ్డీ లెక్కలు చూసుకుంటుండే రఘునాథంకీ విషయాల్లో జోక్యం కలుగజేసుకోటానికి అవకాశమే లేక పోయింది పాపం.

ఇక రఘునాథం భార్యకు తీరుబాటే లేదు. ప్రొద్దున్నే ముస్తాబయి, ఘుమఘుమలాడే సెంటు పూసుకొని వచ్చే పొయ్యే వ్యాపారస్థులతో కిలకిల పకపక నవ్వుతూ, వాళ్లు తెచ్చిస్తున్న మిఠాయి పొట్లాలు, మీఠా కిళ్లీలు అందుకుం

టుండేది. భర్త లేని సమయాల్లో తనే క్యాష్ పెట్టె వద్ద కూర్చొనేది. పద్దుకు వచ్చిన నగలన్నీ పరీక్ష చెయ్యటం ఆమె పని. వయస్సు వచ్చిన పిల్లని కూడా పక్కని కూర్చో బెట్టుకొని బాతా ఖానీ చేస్తుంటే వర్తకులు బేరాలు మానేసి వాళ్ళింట్లోనే ఉండిపోతుండేవారు ఒక్కొక్కప్పుడు తండ్రికొడుకుల్ని సినిమాకు పంపి వాళ్ళొచ్చిన దాకా తల్లీ కూతుళ్లతో సరసాలాడుతూ కూర్చొనేవారు కొందరు పెంకి పెద్ద మనుషులు.

రఘునాథం చాలా అదృష్టవంతుడన్నారు అతని బంధువులు. చాలా తెలివిగల వాడనుకున్నారు ధనార్జన ప్రియులు. కాలక్రమాన రఘునాథం అందరిచేతా లక్షాధికారిఅనిపించుకున్నాడు. మహారాణి పేటలో పెద్ద మేడకట్టేడు. మేడ క్రింద హాలులో తను తన ఇనపపెట్టె కానుకొని మంచం వేసుకొని పడుకునేవాడు. బ్రహ్మ తల్లక్రిందైనా ఆ స్థానం వదిలేవాడు కాడు. ఇక అతని భార్యా పిల్లలు ఎప్పుడూ మేడమీదే ఉండేవాళ్ళు. పైన వాళ్ళేమి చేస్తున్నారనే తలపే లేకుండా తనుండేవాడు. నిజానికి ఈ విషయాలన్నీ ఆలోచించటానికతనికి తీరుబడేదీ.

'వాడికిచ్చినదెంత? వీడి వద్ద నుంచి రావలసిందెంత? ఆ బాపతు వడ్డీ ఇంకా ఎంత వసూలు కావాలె. ఈ 'నోటు'కు ఎప్పుడు కాలదోషం పడుతుంది. ఆ బంగారం మంచిదో కాదో.' ఇవే అతని మనసులో ఎప్పుడూ ఆలోచనలు. పిల్లవాడు స్కూలుకెందుకు పోవటం లేదు, దానివల్ల నష్టమేమిటి, పిల్లకు పెళ్లి ఈడొచ్చింది— ఏదైనా సంబంధం చూడాలే—అనే గొడవలే ఆయనకు లేవు.

ఓసారి ఏదో బాకీ వసూలు కోసం రఘునాథం మరో ఊరెళ్లేడు. ఇదే సమయం కదా అని మారు తాళాలతో ఇనపపెట్టె తీసి వెయ్యి రూపాయలు పట్టుకొని కొడుకెక్కడికో పారిపోయాడు. రఘునాథం రాగానే సంగతి తెలుసుకొని చాలా చిరాకుపడ్డాడు. ఇంట్లో అందరినీ తిట్టేడు. పిల్లవాడు పారిపోయాడని కాదు—డబ్బు పోయిందని. 'ఎందుకలా చిరాకు పడటం, సరదా పడి వెళ్లేడు. నాలు గాళ్ళా తిరిగి వాడే వస్తాడు' అని

# లక్షాధికారి

భార్య నోరు చేసుకునేటప్పటికి చప్పబడ్డాడు. డబ్బు పోయిందంటే నలుగురూ మరీ చులకనగా చూస్తారు. అందుకని ఊరుకున్నాడు.

సంధ్య చీకటయింది వీధిలో ఎలక్ట్రిక్ లైటు వెలిగింది. క్రమంగా రాత్రయింది. రఘునాథం వీధి అరుగుమీద పడుకొని ఏదేదో సణుగుకుంటున్నాడు. ఎవరో మేడ మీద మెట్లెక్కుతున్నట్టు చప్పుడైంది. ముసుగు తియ్యకుండానే 'ఎవరదీ' అన్నాడు. ఎవ్వరూ పలుకలేదు. చప్పుడాగింది. రఘునాథం ముసుగు తీసి చూసాడు. ఎవరో మీది గదిలోకి దూరినట్లు అనుమానం వేసింది.

'అమ్మాయా! ఎవరే అదీ!' అని పిలిచాడు.

'ఎవ్వరూ లేరు నాన్నగారూ...' అంది కూతురు గబగబ మెట్లు దిగివచ్చి. రఘునాథం మళ్లీ ముసుగు పెట్టుకున్నాడు. కానీ నిద్ర పట్టలేదు. మేడ మీదేవో శబ్దాలు వినబడుతున్నాయి. భార్య రెండవ ఆట సినిమా కెళ్లింది. తను లేచి పైకెళ్లి మేడమీద తలుపులు తడదామనుకున్నాడు. రెండడుగులు ముందుకు వేసేడు. మళ్లీ వెనక్కు తిరిగి వచ్చి పడుకున్నాడు. ఇంతలోకే సినిమా వదిలారు. భార్య వచ్చి చకచకా మెట్లెక్కి పైకి వెళ్లింది. తన పూచీ లేకుండా తల్లే పిల్లను మందలిస్తుందనుకున్నాడు. కానీ ఆ ముగ్గురూ కలసి నవ్వులాటలో మునిగిపోవటం తన కాశ్చర్యం కలిగించింది.

'అతడెవడై ఉంటాడు. వాళ్లిద్దరికీ అంత ఆనందం కలిగించేవాడు మరెవడై ఉంటాడు. అయితే ఆ పరపతిగాడే అయి ఉండాలి. అవును, మేడ మెట్లెక్కేటప్పుడు ఆ నడక, ఆ సెంటువాసన— వాడేనని అప్పుడే అనుమానం వేసింది ... వాడు మంచివాడు. బుద్ధిమంతుడు కూడాను. కులానికి కోమటి బిడ్డయినా మన యింట్లో మనిషిలాగే మసులుతాడు. వాడిని అనుమానించటం చాలా తప్పు. నిజానికి పరపతిగాడివల్లనే మన వ్యాపారం చాలా అభివృద్ధి పొందింది. వాడి ద్వారా పెట్టిన పద్దుల్లో ఒక్కటీ విడువడలేదు అన్నీ మనకే ఉండిపోయాయి. మన ఇంట్లో ఉన్న బంగారు నగల్లో సగానికి పైగా వాడివల్ల వచ్చినవే. ఇక అందరిలాగ కాక వాడు మాత్రం ఏ వారం వడ్డీ ఆ వారం యిచ్చేస్తాడు. అటువంటి వాడు మనకు ద్రోహం తల పెడతాడనుకోవటం వెర్రి. వాడితో జట్టి పెట్టుకుంటే మన వ్యాపారం మట్టి కొట్టుకు పోతుంది ...... నేనెళ్ళి వాళ్ళ నేమన్నా అన్నానంటే అల్లరవుతుంది. నలుగురూ వింటారు. నవ్వుతారు. అందువల్ల ఒక్క కాణీ కూడా నాకు లాభం ఉండదు. ఎవరికర్మ వాళ్లది' ......అని రఘునాథం నిర్ధారణ చేసుకొని మొలనున్న తాళాల గుత్తిమీద చేయి వేసుకొని హాయిగా నిద్రపోయాడు.

ధనం కూడుతున్నకొద్దీ భక్తి లక్షణాలు కూడా పెరుగుతుంటయి మనుషులకి. పట్టు పంచలు కట్టుకొని భోజనాలు చెయ్యటం, కొబ్బరికాయలు పట్టుకొని శివాలయానికెళ్లటం, మెడలో తులసి పూసల మాల వేసుకోవటం, ముఖం మీద తెల్లని విభూతి చారలు పెట్టటం, చెవిలో మారేడు పత్రి దోపటం, ఇవన్నీ ఆ భక్తి లక్షణాలు. ఇంకా కొంచెం ఎక్కువ రేటు వడ్డీ పుచ్చుకునేవాళ్లు ఎప్పుడూ 'ఓం! నమశ్శివాయ' అనో, 'రామచంద్ర ప్రభో' అనో అందరికీ వినబడేటట్లు బిగ్గరగా ఉండుండి, అరుస్తుంటారు. వీళ్లకింత భక్తి ఎందుకో అని మీరనుకోవచ్చు. వీళ్లందరూ భక్తిని తమ స్వార్థంకోసం వినియోగించుకుంటారు. అమాయక ప్రజలు వీళ్లను చూచి మోసపోయి సాలెపురుగు గూటిలో ఈగలు చిక్కుకున్నట్లు, చిక్కుకొని నశించిపోతుంటారు. రఘునాథం కూడా ప్రతి సోమవారం హాటకేశ్వరాలయానికి పోవటం, వీధి అరుగు మీద కూర్చొని అందరూ చూచేటట్లు జపమాల త్రిప్పటం చేస్తుండేవాడు.

* * *

హఠాత్తుగా ఒకనాడు రఘునాథం కొడుకు ఒక పిల్లను వెంట బెట్టుకొని జట్కానుంచి దిగాడు. అమ్మాయి చదువుకున్నదని ఫేషన్ చెబుతోంది. ఆ వీధి వారందరూ మూగారు. అందరిలోనూ

"ఈ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకున్నాను. ఈమె నా భార్య' అన్నాడు ధైర్యంగా కొడుకు. అందరికీ ఆశ్చర్యం కలిగింది.

రఘునాథం లోలోపున సంతోషించాడు, కానీ ఖర్చుకాకుండా కొడుకు పెళ్ళి చేసుకొచ్చాడని. కోడలి చక్కదనాన్ని చూసి మురిసిపోయింది రఘునాథం భార్య, 'వాళ్ళిద్దరు ఎంత సరదాగా ఉన్నారో చూడు నా ఖర్మం ఇలా కాలింది.' అని రుసరుసలాడించి కూతురు. ఇలా కొంత కాలం గడచింది. రఘునాథం కొడుకు, కోడలు—రోజు షికార్లు తిరగటం, ప్రతి రోజూ సినిమాలు చూస్తుంటం, చూసే వాళ్ళకు వికారం కలిగించింది. రోజు పదో పదిహేనో తండ్రిని అడగటం—ఇవ్వకపోతే దెబ్బలాడటం—ఇరుగు పొరుగువారు మూగటం జరిగేది. ఒకనాడు అడగంగనే డబ్బు ఇవ్వకపోతే కోపంలో తండ్రిని మాటిలో తోసేస్తానని మెడమీద చెయ్యి వేసి గెంటుకెళ్ళుతుంటే పొరుగునున్న నమశ్శివాయ వచ్చి అడ్డుకున్నాడు.

ఒకనాడు రఘునాథం కోడలు క్రిష్టియను పిల్లని ఊళ్ళో పుకారు పుట్టింది. ఈ సంగిలి శివరాత్రినాడు ఈశ్వరాలయంలో ఎవరో రఘునాథాన్ని ప్రశ్నించేరు వెంటనే రుద్రుడై వచ్చి నానాతిట్లు తిట్టాడు రఘునాథం.

'ఈ కొంప పరువు మర్యాదలు తగలబెడుతున్నారు. ఈ తల్లి పిల్లలు' అని రచ్చచేసేడు. పెద్ద—చిన్న అందరూ చేరేరు. రఘునాథం కొడుకుని ప్రశ్నించేడు. !

'అవును అది క్రిష్టియన్ పిల్ల. నా ఇష్టమయింది. మీకేం' అని గసిరేశాడు కొడుకు.

రఘునాథం కొడుకుని కొట్టబోయాడు. కోడలు అడ్డుకుంది. కోడల్ని తోసేశాడు రఘునాథం. ఇనపపెట్టెకు కొట్టుకొని ఆమె తలకు పెద్దదెబ్బ తగిలింది. కొడుకు వెర్రికలేస్తూ గునపం తీసుకొని తండ్రి మీదకి విసిరాడు. రఘునాథం గుండెలపై బడింది. నేలకూలాడు. నెత్తురు కక్కాడు రఘునాథం. పోలీసులకి కబురందింది. అందరూ అరెష్టయ్యారు. రఘునాథాన్ని అతని కోడల్ని ఆస్పత్రిలో వేశారు. కేసు విచారణ అయింది. మేజిస్ట్రేటు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రఘునాథం 'నన్ను చంపి నా ధనాన్నపహరించాలనే ఉద్దేశంతో నా కొడుకు కోడలు కుట్ర పన్నారు' అని వాంగ్మూలం ఇచ్చాడు. తండ్రిని కొట్టినందుకు కొడుకు కోడళ్ళ మీద, కోడలిని కొట్టినందుకు తండ్రి మీద పోలీసులు కేసు పెట్టేరు. విచారణ జరిగింది. కొడుక్కి ఆరుమాసాలు జైలు శిక్ష, తండ్రికి అయిదువందల రూపాయలు జరిమానా విధించింది కోర్టు. రఘునాథం జరిమానా కట్టి నెమ్మదిగా తల వంచుకొని కోర్టు బయటకు వచ్చాడు. ఎవ్వరూ తనని పలకరించలేదు. కాళ్ళు వణుకుతున్నాయి. తట పటలాడుతున్న కాళ్ళకి సహాయంగా కర్ర కూడా ఎవ్వరూ అందివ్వలేదు. నెమ్మదిగా నడుస్తూ ఇంటి కొచ్చాడు. చీకటి పడింది బాగా. వీధుల్లో ఎలక్ట్రిక్ లైట్లు వెలుగుతున్నాయి. గుమ్మంలో మెల్లగా కాలు పెట్టేడు రఘునాథం.

"ఏం మావయ్యా కులాసాగా వచ్చావా!" వెకిలిగా నవ్వుతూ పలకరించేడు పరపతి. వెనక్కు ముందుకు సారా నిషాలో ఊగుతూ—'మనం ఈ ఇంటి అల్లుళ్ళం. ఇనప్పెట్టె తాళాలు మన చేతిలో ఉన్నాయి.' అన్నాడు గల గల తాళాలాడిస్తూ. మేడ మీదినుంచి రెండు స్త్రీ కంఠాలు పక పక నవ్వాయి. పెరట్లో చెట్టుమీద గుడ్లగూబ అరిచింది. వీధిలో ఎలక్ట్రిక్ దీపం సంతాప సూచకంగా కాబోలు ఆరిపోయింది.

నిలబడ్డపాటున కూలిపోయాడు గడపలోనే రఘునాథం. రఘునాథం నోటినుంచి రక్తం ప్రవహిస్తోంది. ప్రాణం గిజ గిజ కొట్టుకుంది. ఒళ్ళంతా వణికింది. రెండు కళ్ళూ తెరుచుకొని ప్రాణం పోయింది. శరీరం కర్ర కట్టింది. తెల్లవారింది. రఘునాథం శవం ఇంకా గుమ్మంలోనే పడి ఉంది. ఆ రోజు సాయంత్రం వరకూ అలాగే పడి ఉంది........●

